ఓడిపోయినవాళ్ళు

కాల్వ రాజిరెడ్డి

తల్లిదండ్రులతనికి పెట్టిన పేరు రామనాథం. ప్రజానీకం నోట్లో అతను లాయరు రామనాథం. 'లా' పట్టా పుచ్చుకొన్నాక అయిదారు కేసులు పట్టక పోలేదు. కాని అవన్నీ పుచ్చిపోయినయి. అందుకే జుట్టంతా పీక్కుంటూ చెట్ల కింద పిచ్చిగా తిరిగాడు. చెట్టుకింద ప్లీడరూ అని అన్నారు కొందరు అప్పట్లో. కాని ఆపేరే నిలవలేదు. ఆపైన స్వాతంత్ర్యంకోసం అష్టకష్టాలు పడుతున్న క్లిష్టమైన రోజులవి. స్వాతంత్ర్య సమరభారతి పిలుపు అందిందంటూ ఇల్లువిడిచి ఢిల్లీవెళ్ళిపోయాడు రామనాథం. మైళ్ళకొద్దీ నడిచాడు. జైళ్ళలో కెళ్ళాడు. సత్యాగ్రహాల్లో పాల్గొన్నాడు. మనస్వేచ్ఛాస్వాతంత్ర్యాల కడ్డంగా నిలచిన ఈ తెల్లవాళ్లను మనదేశంనుంచి వెళ్ళగొట్టాలంటూ ఉపన్యాసాలిచ్చాడు. కొన్నేళ్ళు గడ్డం పెంచి సన్యాసిలా దేశమంతా తిరిగాడు. మొత్తానికి రామనాథం చాలా కష్టపడ్డాడు. అందులో సందేహం లేదు — ఇదంతా పంతొమ్మిదివందల నలభై ఏడుకు ముందు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పిదప రామనాథం, లాయరు రామనాథం అయ్యాడు. ఒకానొక సభలో ఒకఛోటా నాయకుడు దేశ స్వాతంత్ర్య సమరంలో లాయరు రామనాథం పాత్ర—అనే విషయం మీద ప్రసంగం చేసాడు. ఆయన గంటసేపే చేసిన ఆ ప్రసంగంలో లాయరు రామనాథం అని వెయ్యి సార్లైనా అనివుంటాడు—సదరు లాయరు రామనాథం నాటినుంచీ నేటిదాకా ఎన్ని ఉపన్యాసాలు చేసాడో లెక్కలేదు. బహుశః 'ఆంధ్ర దేశంలో ఆయన ఎక్కి దిగని వేదికంటూ లేదేమో. మహానుభావుడంటూ చేతులెత్తి ఆయనకు మొక్కని మనిషికూడా ఉండడంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఆయన ప్రసంగాల్లో దొర్లిన విషయాలు ఒకటా, రెండా ... వో యబ్బో? సంఘసేవన్నాడు. సమాజ వికాసమన్నాడు. పతిత జనోద్ధరణ, సంకరజాతి పెళ్లిళ్ళు, విధవా పునర్వివాహాలు, స్త్రీవిద్య, వయోజనవిద్య, వయసుమళ్లిన వాళ్లు సన్యాసం పుచ్చుకున్నా సంఘాని కెంతెంతో సేవచేసిన వారవుతారని కూడా అన్నాడు.

ఎమ్మెల్యేగా పోటీచేశాడు. రెండుసార్లూ ప్రత్యర్థులధాటికి గెలవలేక పోయాడు. అంతా అయింతర్వాత ఎమ్మెల్యేగా గెలిచినా ఒక గొప్పచిక్కే అవుతుంది. ఏదో ఒక మంత్రిపదవి యిస్తారు. దానికి తంత్రవాది అయివుండాలి. అలాంటి మాయామంత్రాలు తనలాటి స్వచ్ఛంద సేవకుడికి సుతరామూ యిష్టంలేదూ అని ఒకానొక సభా ప్రాంగణంలో స్ఫటికం లాటి తన మనస్సును జనం ముందుంచాడు లాయరు రామనాథం, అప్పుడే కరెంటు దీపాలు ఆరిపోగా ఆవరించిన తమస్సులో.

అల్లా, నారాయణ ఒకరే అన్నట్లుగా మంత్రిపదవి అయినా, ఈ జిల్లా పరిషద్ చెయిర్‌మన్ అయినా నాకొకటే— అని చెయిర్మన్ అయింతర్వాత ప్రారంభోపన్యాసంలో సెలవిచ్చారు లాయరు రామనాథం.

ఇది ఇలా వుండగా—

రంగనాథం బుర్ర ఆలోచనలో వేడెక్కిపోయింది. లోలోపలే ఏదో గొణుక్కుంటూన్నాడు ఈజీచెయిర్ లో కూచొని. రంగనాథం ఎవరోకాదు—లాయరు రామనాథం ఏకైక పుత్రరత్నం. ఎప్పటికైనా తండ్రి అంతటివాడు కావాలన్నదే అతని నిరంతర ప్రయత్నం. ఆదర్శాలకేం గాని అడ్డొచ్చిందీ మధ్యే 'ప్రేమ' అనే గడ్డు పదం

కాలేజీలోనేమొ చదువు. కలేజాలోనేమొ

వలపు. మనసు ప్రేమసముద్రం ఆటుపోట్లు హృదయం మీద విసిరే మన్మథుడి పూలబాణాల గట్లు, తూట్లు.

తండ్రేమో పెళ్ళిచేయడు. తనేమో నోరువిప్పి అడుగడు. ఏమని అడగ్గలడు? నాకోరిస్టువాచీ కొనియ్యి నాన్నా, నాకో స్కూటరు కొనియ్యి నాన్నా అన్నట్టుగా నాకోపిల్లను తెచ్చిపెట్టు, నేను తాళి బొట్టు కట్టుతానని అంటాడా? ఎంత పిర్లి!

ఎవరైనా మిత్రులు తన పెళ్ళిగురించి తండ్రి నడిగినప్పుడు 'ఇప్పట్లో ఆ ఉద్దేశ్యమే లేదు. పెళ్ళి కాస్తా అయిందంటే బద్ధకించి పోతాడేమోనని అనుమానం. అసలువిషయం చెప్పాలంటే చదువు పూర్తి కాందే పెళ్ళి చేసుకోననేదే వాడి సిద్ధాంతం' అని చెప్పుకుపోతుంటే అది వానాకాలమే అయినా అరికాలిమంట తల కెక్కేది రంగనాథానికి.

ఎవరైనా ఒక పిల్లనుజూసి ప్రేమిం చేస్తే మంచిదేమోనని వారం రోజుల్నించీ అతి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు రంగనాథం. ఆనాడు సాయంకాలం అలా ఊరి మీద పడ్డాడు.

ఈ వెధవ ప్రపంచంలో చివరికి ఒక విధవాడపడుచు కనిపించింది—అదీ ప్రక్కవీధిలోనే. అప్పటికి ఆపిల్లే తనకు పెన్నిధి అనుకున్నాడు.

రామాయణం చదివే ఈడులో లేదా పిల్ల. మెల్లగా ప్రేమాయణంలోకి దింపాడు రంగనాథం.

సుధ విధవైనా నెరజాణ కాబట్టి వీరిద్దరి ప్రేమ ఆరు రోజుల్లోనే మూడు పూలు ఆరు కాయలైంది.

రాత్రి ప్రణయం, పగలంతా విరహం తప్ప ఆ వారం రోజుల్లో వాళ్ళ కళ్ళ కేమీ కన్పించలేదు. వాళ్ళ మనసుల్లో ఏ విషయమూ తలెత్తలేదు.

ఆనాటి రాత్రి సంకేత స్థలమైన ఊరి బడిదగ్గర కలిసారు. ఈ మధ్య కాలంలో బళ్ళే ప్రేమ పూజారుల గుళ్ళయినాయి గదా! మరి అజిటేషన్ల సమ్మెల మూలంగా మూసివేయబడినయి బళ్ళన్నీ. జట్టురేగిన బడిపిల్లలతో నిండిపోయినయి ఊళ్ళన్నీ, నిండిపోయినయి బూజు పట్టిన పుస్తకాలతో యిళ్ళన్నీ.

ఆ చిన్నారి పిల్లల బడే సుధా రంగనాథుల రాసక్రీడలకు బృందావనము అయింది. బడిప్రక్క పారుతున్న మురికి కాలువ ఒడ్డే యమునాతటము.

'సుధా! నీ పేరెంత మధురమో నీ రూపంత ముగ్ధ మనోహరము'

రంగనాథం రిమార్కు, ఆరు రోజుల సర్వే అనంతరం.

'మీరు కవిగారు కూడానా?' సుధ గొంతులో వ్యంగ్యం.

'కపి చేష్టలేగాని నా కవి హృదయం నీకేం తెలుసు సుధా. అయినా నీలాంటి అపరంజి బొమ్మను చూస్తే కవిత్వంరాక వైరాగ్యం కల్గుతుందా?...'

మాటలులేని కొన్ని క్షణాల్లో కీచురాళ్ళ రణగొణలు, యమునాతటిని కప్పల బెకబెకలు మాత్రం వినవచ్చినయి.

ఈతచెట్టు మీన్నుంచి పిట్ట ఒకటి 'తీ, తీ' అంటూ ఎగిరి చీకట్లో కలిసి పోయింది.

'నువ్వు విధవ్వి, మరి మానాన్న యీ పెళ్ళికి అంగీకరిస్తాడో లేదో?'

'ఆ వెధవాలోచన్లు ఇప్పుడెందుకండి? హాయిగా...'

'హాయి మాటకేం గాని మన భవిష్యత్తును గురించి కూడా ఆలోచించాలి గదా.'

'మత్తులో మునిగివున్న ఈ గమ్మత్తైన మధురక్షణాల్లో భవిష్యత్తును గురించి బెంగ దేనికండి? వర్తమానం ఘడియల్ని హాయిగా అనుభవించి ఆనందించక'

'ఏవిటి? నువ్వు అన్నీ నా డైలాగులు కొడ్తున్నావు సుధా?'

'ఈనాటి మగవాళ్ళు మరీ పిరికి వారవుతున్నారు. మొదట్లో హుషారుగా 'మలయసమీరే' అంటూ ఉరకలేసేది మీరే. మధ్యలోనే నాన్నంటే భయం, లోకం దృష్టిలో తేలికయిపోతానేమో నంటూ పారిపోయేది మీవాళ్ళే. ఆడది అడుగు వెయ్యదు. వేసిందంటే వెనక్కి వెళ్ళేది లేదు.'

'సుధా! నువ్వు చలం పుస్తకాలు...'

'చదివితేనే కోరికలు పుట్టుకొస్తాయి కాని వితంతువు కొక శరీరం అంటూ ఉండదా? దాన్లో ఉన్నవి ఉడుకునెత్తురు ప్రవహించే నరాలుగావా? దుడుకుతనంగ ప్రవర్తిస్తే లోకాని కెందుకీ ఉడుకమోత్తనం?...'

'నూరు వరాల మాటన్నావు సుధా. నీ సన్నిధే నాకు పెన్నిధి. నీ బిగి కౌగిలిలో ప్రాణంతో నన్ను సమాధి చేయ సుధా. నిన్నే పెళ్ళి చేసుకొంటాము ఇదిగో ప్రమాణం చేస్తున్నాను.'

రంగనాథం సుధ చేతిలో తన చేయి నుంచబోయాడు.

సుధ తన చెయ్యిని లాక్కుంది.

'ఈ ప్రమాణాలమీద విమాన ప్రయాణాల మీద నా కాట్టే నమ్మకం లేదు, మన మనసులే సాక్షి.'

'ఓహ్, విమానప్రమాదంలో గతించిన మీ ఆయన్ని గుర్తుకొచ్చేట్టు నేను మాట్లాడేనా? సారీ సుధా'

'ఈ ప్రమోద సమయంలో ఏనాడో జరిగిన ఆ ప్రమాద ప్రసక్తి ఎందుకండి? మీసేవే నా కాసక్తి. మనల్ని విడదీయలేదు ఏ శక్తీ. ఏవండీ?'

'అదే, మా నాన్న వస్తున్నా డిక్కడికి ఎల్లుండి. మన వివాహ ప్రసక్తి అప్పుడే తీసుకొస్తాను. అన్నట్టు మరిచా. మా నాన్నెందు కిక్కడికి వస్తున్నాడో తెలుసా? విధవా పునర్వివాహ వికాస మండలి పదిహేడో వార్షికోత్సవ సందర్భంగా మా నాన్నగారిని ముఖ్య అతిథిగా పిలుస్తున్నారు.'

జిల్లా పరిషద్ చెయిర్మన్ లాయరు రామనాథం చాలురోజులు డిస్ట్రిక్టు హెడ్ క్వార్టర్సులోనే ఉంటాడు. అప్పుడప్పుడు తన ఊరికి వచ్చిపోతూ వుంటాడు.

గాఢ పరిష్వంగంతో ఆనాటి రాత్రి ప్రేమలీలలు ఘట్టానికి యవనిక పడింది. అతి భారంగా అడుగులేసుకుంటూ విడిపోయారిద్దరు.

లాయరు రామనాథం ఆరోజు ఉదయం వచ్చాడు. రంగనాథం తన ప్రేమ విషయాన్నెలా చెప్పాలో తోచక అవస్థ పడుతున్నాడు.

'నాన్నా' అని విప్పిన నోరును అప్పుడే చప్పున మూసేసాడు.

'ఏరా నాన్నా? చెప్పు రంగడూ' లాయరు రామనాథం లాలన.

ఓడిపోయిన వాళ్లు

కాదు నాన్నా...నాన్నా...రేపు ఏదోరవారు స్పీచెస్ యిస్తున్నారు.'

'హాఁ అదా? ... అరె స్పీచ్ అంటే గుర్తు కొచ్చింది' సిగరెట్టు ఒక్క దమ్ము పీల్చి లాల్చీ జేబులు వెదికి 'అరె ఆ కాయితం పోయిందే' అని గొణుక్కున్నాడు.

'ఒరే రంగడూ ఆ కాయితం చూసావా ఎక్కడైనా?'

'ఏ కాగితం నాన్నా'

'అదేరా ఇవ్వాళ స్పీచ్ యివ్వాలని. కొన్ని ముఖ్యమయిన పాయింట్స్ రాసుకున్నానురా. ఆ విడిచిన చొక్కాలో చూడరా.'

రంగనాథం తీసుకొచ్చాడు కాయితాన్ని.

'అది చదవరా, అందులోని కొన్ని విషయాలు సభికుల్ని చాలా చకితుల్ని చేస్తాయిరా రంగడూ. నా ఆదర్శాలు, ఆశయాలను సభికుల ముందుంచే సదవకాశం యిది. అందరూ అవి వింటూ అలా నోళ్లువిప్పి గుడ్లప్పగించి చూడాల్సిందేరా.'

నాన్నగారి చిక్కురాత సరిగ్గా అర్థం కాలేదు రంగనాదంకు.

'ఆ పాయింట్ అర్థమయిందా, అక్కడ చదువు' అని వేలితో చూపించాడు. రంగనాథం చదివాడు లోలోపలే, "నా కొడుకే ఏ వితంతువునైనా ప్రేమిస్తే ఇప్పుడే ఆమెను నా కొడుక్కు పెళ్లి చేసుకొంటాను...'

రంగనాధంకు చెమటలు పోసినయి.

ఏదో చెప్పబోయాడు కాని తెరవలేదు నోరు.

అప్పుడే వచ్చి యింటి ముందాగింది కారు. నల్గురు మనుష్యులు దిగారు. రామనాథంతో మూడుముక్కలు చెప్పారు. అందరూ కలిసి కాస్సేపట్లో బయటికి వెళ్లిపోయారు.

సాయంకాలం ఆరున్నర గంటలకు ప్రారంభించాల్సిన కార్యక్రమము సభాధ్యక్షులు వంకాయల వెంకటసుబ్బయ్యగారు లేటుగా వచ్చినందున ఎనిమిది గంటలకు మొదలయింది.

లేటు కమింగ్ మీద ఫూ ప్రైవ ప్రసంగం ప్రారంభించాడో లేదో ఆ ఉగ్రవాది కార్యకర్తను తక్కినవాళ్లు వేదిక మీదినుంచి క్రిందకు తీసికెళ్లారు. వెంకటసుబ్బయ్య ముఖం వెలవెలా బోయింది.

ఛీఫ్‌గెస్ట్‌గా లాయరు రామనాధం తన ఉపన్యాసం ప్రారంభించాడు. ప్రతి అయిదారు నిమిషాలకు సభికులు చప్పట్లు కొడుతూ నవ్వుతున్నారు. రామనాధం హుషారెక్కువైంది.

'...కూరల్లోకెల్లా అతి రుచికరమైనది, ప్రశస్తమైనదిగా వంకాయ కూరనెలా మనవాళ్లు నిర్ణయించారో స్త్రీ సమస్యల్లోకెల్లా అతిముఖ్యమైనది ఈ వితంతు పునర్వివాహము అని నా అభిప్రాయము...'

'అధ్యక్షుల వారిమీద ఒకవిసురు విసిరాడురా' అన్నదొకకంఠం జనంలోంచి.

మరో ఐదునిమిషాల తర్వాత, '...బహిరంగ సభలకే గానివ్వండి, సాహితీ సదస్సులకే కానీండి, మనమీనాడు సభా ప్రారంభ సమయానికొక గంట లేటుగా వెళుతున్నట్లుగానే ఈ పునర్వివాహ విషయాన్ని చాలా లేటుగా గుర్తించారు. అత్యంగానే గుర్తించారే అనుకొన్నా ఈనాటికి ఏం సాధించామని? ప్రతి సభలోనూ ఇండియన్ స్టాండర్డ్ టైమ్‌ను గురించి మాట్లాడుతూ ఒకరినొకరు విమర్శించుకొంటూనే వున్నా ఆ విషయంలో ఏ ప్రగతి సాధించనట్లే ఈ పునర్వివాహాన్ని గురించి దేశంలో ఎన్ని మండలులు వెలసినా, ఇన్నేళ్లు గడిచినా ప్రోగ్రెస్ ఏమాత్రం కనిపించడంలేదు...'

'అబ్బ ! అబ్బ ! అధ్యక్షుల వారి మీద దెబ్బమీద దెబ్బ కొడుతున్నాడోయ్' అన్నారెవరో సభలో. ఒకటే నవ్వులు.

అయినా లాయరు రామనాధంను ఎవరూ గద్దించలేదు వెంకటసుబ్బయ్యగారి మొఖం వెలవెలా బోలేదు.

అదే ఒక తిట్టుకు, విట్టుకు మధ్య భేదం, ఒకసాధారణ సభా కార్యకర్తకు, గొప్ప సంఘ సంస్కర్తకూగల తేడాయేమో!

'ప్రతిఒక్కరూ ప్రసంగాలుచేసి తానూ ఒక గొప్ప సంఘ సంస్కర్త అని పేరు చెప్పుకొని చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించాలని పట్టుపట్టటం, తన కాంస్య విగ్రహం కాకపోయినా కనీసం ఒక శిలావిగ్రహమైనా చౌరాస్తాలో ప్రతిష్ఠించాలని నిరశన వ్రతాలు చేయటమేతప్ప, ప్రాక్టికల్‌గా ఇదీ విషయం అని చేసి చూపించిన మొనగాణ్ని ఒకణ్ని చూపించండి ఈ దేశంలో నాకు, ఒక్కగా నొక్కణ్ని ... ఉదాహరణకు నేనే ఉన్నాను అనుకోండి. నాకు ఒకకొడుకున్నాడు, పెళ్లీడు వచ్చినవాడు. వాడే కనుక ఒక వితంతువును ప్రేమించానని చెప్తే లేక ప్రేమించకున్నా



ఓడిపోయిన వాళ్ళు

సరే ఫలాన వితంతువును పెళ్ళి చేసుకుంటానని అన్నా తక్షణం పెళ్ళి చేస్తాను. ఇది వట్టిమాటకాదు. మీముందు ప్రమాణంచేసి చెప్తున్నాను.'

సభకేసి చూసాడు కాస్సేపు. అంతా మౌనం.

రంగనాథం ఆడవాళ్ళకేసి చూసాడు. అక్కడినుండి సుధ తనకేసి చూడ్డం గమనించాడు. గుండె దడదడలాడింది. తనకు సుధతో ఉన్న సంబంధం గురించి చెప్పాలా? ఊహుం ఇంత బ్రతుకు బ్రదికి ఒక అఘ్రాణిత పుష్పాన్ని స్వీకరించటమా? ఏ కాలేజిగర్ల్నో పెళ్ళి చేసుకోక, కాని సుధ? పాపం...

'చిల్లికానీ కట్నం తీసుకోకుండా నా కొడుక్కిప్పుడే పెళ్లిచేస్తాను. ఈ కట్నం అనేడి ఒక దురాచారం మన సమాజం పాలిటి పెనుభూతం. దాన్ని గురించి చెప్పాలంటే ఒక రోజయినా చాలదు. అది వేరే ఏదైనా సభలో విందురుగాని. కాని ప్రస్తుత విషయం గురించే నా జెంగ. కాని నాకా అదృష్టం ఏది? మా వాడికంత ఆదర్శం ఏది? పండిత పుత్రుడనే సామెత వుండనే వుంది. నాతల వెంట్రుకలెన్నో నాకన్ని ఆదర్శాలు, ఆశయాలు. కాని ఏం లాభం? మావాడిలో టార్చిలైటు—కాదు-ఎక్స్‌రేవేసి చూసినా అణుమాత్రం కూడా కనిపించవు. అది నా దురదృష్టం. పూర్వజన్మలో చేసుకొన్న పాప ఫలితం' సభలో ఆడవాళ్ళకేసి చూసి,

'మీరు మరోలా భావించవద్దు నేనొకటి అడుగుతాను మిమ్మల్ని. ఇప్పుడు ఇక్కడ వున్న బాలవితంతువుల్లో ఎవరైనా మావాడిని ప్రేమించిన వాళ్ళున్నారా? పోని పెళ్ళి చేసుకోవటానికి ఇష్టపడే వాళ్ళున్నారా? మావాడి కిష్టం ఉన్నా లేకపోయినా నచ్చజెప్పటానికి ప్రయత్నిస్తాను' కాస్సేపాగి.

'ఎవరూ లేరు. అవును ఇది నా దురదృష్టంగాక...'

'అది మీ దురదృష్టంకాదు' అంటూ ఒక అమ్మాయి లేచింది.

'ఎవరమ్మా నువ్వు?'

'పేరు సుధ. నేను, మీ కొడుకు రంగనాథం ప్రేమించుకున్నాం'

'నిజంగానా? ఎవరమ్మాయి వమ్మా' కళ్ళజోడు సవరించు కున్నాడు, వెధవ చత్వారం' అని గొణుక్కుంటూ.

'చలపతిరావు గారమ్మాయిని'

'ఓహో ఇంజనీరింగు పై చదువులకని అమెరికా వెళ్తుండగా విమాన ప్రమాదంలో మరణించిన అబ్బాయి శంకరం తాలూకు...'



'.........

'రంగనాథం! ఈ అమ్మాయి చెప్పింది నిజమేనా?'

ఔనన్నట్టు తల వంచింది అతి భారంగా అడుగులేసుకుంటూ సభాప్రాంగణంలో నుంచి బయటికి వెళ్ళాడు, విషాదఘట్టంలో సినిమా హీరో నిష్క్రమించినట్టు.

ఒక జిల్లాలోనే కాదు, రాష్ట్ర మంతటా తెలిసింది ఈ విషయం.

అవి మే పదవ తేది. సుధ రంగనాథంల వివాహం అతి వైభవంగా జరిగింది. ఒక మంత్రిగారు, కలెక్టరు, ఇతర ప్రభుత్వోద్యోగులు, కంట్రాక్టర్లు, వోహ్ ఒకటేమిటి, వేలకొద్ది జనం ఆ పెళ్ళికి హాజరయినారు. రంగనాథం, రామనాథంలను మెచ్చుకోనివారు లేరు.

మరునాడు పత్రికలు లాయరు రామనాథం, కొడుకు కోడలు ఫోటోలను ప్రచురించి 'ఆదర్శ వివాహం' అనే మకుటంతో సుధా రంగనాథంల పెళ్ళిని శ్లాఘించాయి.

రెండురోజుల అనంతరం మిట్ట మధ్యాహ్నం...

లాయరు రామనాథం కుర్చీలో కూచుని తల పట్టుకొని ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. రంగనాథం యింట్లోంచి అప్పుడే వచ్చాడక్కడికి.

'ఇన్నేళ్ళుగా ఎన్నో పద్మవ్యూహాల్లో విజయం సాధించి చివరికి ఈనాడు వోడిపోయానురా రంగడూ, నేను వోడిపోయాను. నువ్వొక వితంతువును ప్రేమిస్తున్నానని నా కొక్కమాట చెప్తే నేనలా లెక్చర్ ఇచ్చేవాణ్ని కాను. అయినా నేనలా చెప్పబోతున్నట్టు నేను చూపిన కాయితం ల్లా నీకు తెలిసి ఉండి కూడా ఎందుకు మాట్లాడలేదురా. మరి ఆ అమ్మాయి మన కాళ్ళా వేళ్ళా పడి బతిమాలుకొంటే కొంత డబ్బిచ్చి పీడా విరగడ చేసుకొనేవాళ్ళం గదా. ఫారెస్ట్ కంట్రాక్టర్ భాస్కరరావు అరవైవేలు కట్నం ఇస్తానన్నాడురా, అరవైవేలు! పిల్ల? రంభనుకో. కాని ఏం లాభం? అంతా అయిపోయింది.'

రంగనాథంకు క్రోధం పెల్లుబికింది. 'మీరే దీనికంతటికి కారణం నాన్నా! వాడి

పోయింది మీరుకాదు, నేను. వయసులో ఉన్న నాకు మీరు మొదటే గ్రహించి పెళ్లి చేయకపోవటం పెద్ద పొరపాటు. పోనీ, ఈ భాస్కర్రావు విషయం పదిరోజుల ముందు చెప్పినా నేనీ సుధను చూసేవాణ్ని కాను. ఆమాటకొస్తే అసలు సుధను నేను కామించానేగాని ప్రేమించలేదు నాన్నా. అందుకే ఆనాడు ఏ నిర్ణయమూ తీసుకోని నేను సభలో మౌనంగానే వున్నా, మీరే మళ్లీ ఆడవాళ్లకేసి అలా మాట్లాడి ఇంతదాకా తీసుకొచ్చారు. ఇప్పుడు ఆకులు పట్టుకొని ప్రయోజనమేమిటి చేతులు పూర్తిగా కాలింతర్వాత? ఒక విధవను పెళ్లిచేసికొని నా జీవితంలో వోడిపోయాను, చిత్తుగా పరాజయం పొందాను.'

'మీ రెవరూకాదు అసలు వోడిపోయింది నేను' అంటూ లోపలినుండి సుధ కంఠం వినిపించింది.

ఇద్దరూ అప్రతిభులై పోయారు.

'మీ ఇద్దరిలో ఇంత కుళ్లుందని నాకెంత మాత్రమూ తెలియదు. నాకళ్లతో చూసింది, చెవులతో విన్నది మాత్రమే నిజమని అనుకొన్నాను. ఇప్పుడు తెలిసింది మీ సిసలైన నైజం. ప్రేమ ప్రేమంటూ అహోరాత్రాలు నీ పేరే కలవరిస్తూ నీరూపే గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటే మతి పోతున్నది అన్న మాటల వెనక ఇంత నీచత్వం ఉందనుకోలేదు.

'ఆదర్శాలు, ఆశయాలు అంటూ సభల్లో బల్లగుద్ది చెప్పి, సంఘంలో సంస్కర్తగా చలామణి అవుతూ, పత్రికల్లో తమ ప్రసంగ వ్యాసాల్లోని శ్రీరంగనీతులు చూసుకొని ముసి ముసి నవ్వులతో మీసంమీద చెయ్యి వేసుకొనే మీ ఉదాత్తమైన మనసులో ఇంత కాలకూట విషం ఉందా? ఛీ! ఛీ! సిగ్గులేదూ. పైకి ఎన్ని చెప్పితేనేం, హృదయ సంస్కారం లేకపోయిన తర్వాత. తమ కూతురు సుమంగళి అవుతున్నదంటే ఎంతో సంతోషపడ్డారు అమ్మా, నాన్న. ఎంత పిచ్చివాళ్లు?!

విరంతుప్రగా వున్నా నా జీవితం సాఫీగా గడిచింది. ఈనాడు సుమంగళినైనా ఇప్పుడు నా హృదయంలో రేగే ఊహా తుఫాను తీవ్రత ఎంతమంది చూడగల్గుతున్నారు... హే భగవాన్! మొదటి సారి నీ మూలంగా వోడిపోయాను. ఇప్పుడు మనసు, మమత అంటూ తోటి మనుషుల చేతుల్లో రెండోసారి వోడిపోయాను,' వెక్కి వెక్కి ఏడ్చింది సుధ!

తండ్రి కొడుకులిద్దరూ తలలు వంచుకొన్నారు. ●

దగ్గు సెలవు తీసుకొంది!



కొంచెము సేపు ముందు ఆమె దగ్గుతో బాధపడింది. అప్పుడు ఆమె గ్లైకొడిన్‌ను త్రాగింది. ఆమెను యిప్పుడు చూడండి! క్షణంగతీసే దగ్గు తగ్గి ఆమె హాయిగా నిద్రపోతోంది!

దగ్గును అదుపులో పెట్టుటకు గ్లైకొడిన్‌లా ఏమందూ పనిచేయదు!

వైద్య శాస్త్రరీత్యా అంగీకారము పొందిన గ్లైకొడిన్ యొక్క ఫార్ములా 4 పీడిత భాగములలోను పనిచేసి మీకు దగ్గునుండి ఎలా పూర్తి ఉపశమనమును కలిగిస్తుందో చూడండి:

- మెదడులో-దగ్గు రిఫ్లెక్స్‌ను అదుపులో పెట్టును.
- గొంతుకలో-కఫమును విడదీసి, గొంతుక గరగర లాడుటకు ఉపశమనము కలిగించును.
- గుండెలో-బిగుసుకు పోయిన నరములను సడలించి, ఊపిరి సలిపేలా చేయును.
- ఊపిరి తిత్తులలో-అడ్డుపడిన ద్రవములను, చీమిడిని సడలించి, దగ్గును ఆపును.

గ్లైకొడిన్

టెర్ప్ వసాకా

దగ్గుకు నమ్మకమైన, అధికాధికముగా అమ్మకమవుతున్న యింటి మందు

everest/599a/ACW:tel.